నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 2 మే 2025 | KARIMNAGAR

## డంప్ యార్డును తొలగించండి

అలకాపురి కాలనీవాసుల ఆందోళన


ఆందోళన చేస్తున్న అలకాపురి కాలనీ ప్రజలు

కరీంనగర్ కార్పొరేషన్, మే 1 : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని ఆటోనగర్‌లో ఉన్న డంప్ యార్డును తొలగించాలని, దాని ద్వారా వస్తున్న సమస్యలను పరిష్కరించాలని నగరంలోని అలకాపురికాలనీ ప్రజలు గురువారం ఉదయం స్థానిక ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి కోతిరాంపూర్ వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎన్‌టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డంప్ యార్డులో వస్తున్న మంటలు, పొగ ద్వారా చుట్టు పక్కల కాలనీల్లోని ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

## అండగా నిలిచింది బీఆర్ఎస్.. ఆగం చేసింది కాంగ్రెస్

- హక్కుల కోసం కార్మికులు పోరాటం చేయాలి
- మేడే వేడుకల్లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల, మే 1 (నమస్తే తెలంగాణ) : కార్మికుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేసి ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని, పదేండ్ల పాలనలో అనేక పథకాలు అమలు చేసి అండగా నిలించిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించేలా బతుకమ్మ చీరెల ఆర్డర్లు ఇచ్చి బతుకులకు భరోసా కల్పించిందని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి లేకుండా ఆగం చేసిందని ధ్వజమెత్తారు. కార్మిక వర్గాల్లో చైతన్యం, ఐక్యత లేదని, హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. మేడే సందర్భంగా బీఆర్ఎస్ కార్మిక విభాగం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల లేబర్ అడ్డా వద్ద గురువారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులు బాగుంటేనే పల్లెలు, పట్టణాలు పచ్చగా ఉంటాయని భావించిన కేసీఆర్ కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని, కార్మికుల వేతనాలు పెంచారని, సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలను నివారించేందుకు బతుకమ్మ చీరెల ఆర్డర్లు ఇచ్చి చేతినిండా పని చూపారని విషయాన్ని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఆర్డర్లు ఇచ్చి కూలీ తగ్గించిందని, దినదినం కూలీ పెరుగుతుందా..? తగ్గుతుందా..? అంటూ ప్రశ్నించారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ చొరవ తీసుకుని కూలీ రేట్లు తగ్గించుకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్మికుడినే యజమాని చేయాలన్న లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీఆర్ సంకల్పించి సిరిసిల్ల అప్పారెల్ పార్కులో 1100 షెడ్లను నిర్మించినట్టు గుర్తు చేశారు. ప్రతి కార్మికుడికి సాంచాలు ఇవ్వాలని నిర్ణయించారని చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని ఇంత వరకు ప్రారంభించలేదని, దీనిని చూస్తే నేతన్నలపై ఈ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతుందన్నారు. నేతన్నలు, ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రక్తాన్ని చెమటగా మార్చి కడుపు నింపుకుంటున్న కార్మికుల డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలన్నారు. తాను కచ్చితంగా కార్మికుల పక్షపాతి నేనని, విద్యార్థి దశ నుంచి కార్మికుల కోసం పోరాటం చేశానని గుర్తు చేశారు. భవన నిర్మాణ కార్మికుల కోసం ఎంతో కొట్లాడానని చెప్పారు. మరణించిన కార్మిక కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఆ పోరాట ఫలితంగానే వస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ జరుగుతున్నది. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్న తరుగు పేరిట నిండా మునగాల్సి వస్తున్నది. ప్రతి బస్తాకు సంచి బరువు 250 గ్రాములు కలుపుకుని 2.200 కిలోల చొప్పున తూకం వేస్తూ క్వింటాలుకు 5.50 కిలోల మీదనే దోపిడీ చేస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రతి కేంద్రంలోనూ ఇలానే కోత పెడుతున్నా.. ఒక్కో రైతు వేలాది రూపాయలు నష్టపోతున్నా.. పట్టించుకునేవారు లేకపోవడం అన్నదాతను ఆవేదనకు గురిచేస్తున్నది. రెక్కల కష్టం మిల్లర్ల పాలవుతున్నా.. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.


తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం

# తరుగు పేరిట నిలువు దోపిడీ

కొనుగోళ్లలో అడ్డగోలుగా కోతలు

- క్వింటాలుకు 5.50 కిలోల వరకు కటింగ్
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- అమ్మక తప్పని పరిస్థితి
- ప్రతి కేంద్రంలోనూ ఇదే తీరు
- నిండా మునుగుతున్నా పట్టించుకునేవారు కరువు

కరీంనగర్, మే 1 (నమస్తే తెలంగాణ) : రైతులు పండించిన ధాన్యంలో తేమ, తాలు, ఇతరత్రా వ్యర్థాలు ఉండకుండా కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఏక్యూ పేరిట కొన్ని నిబంధనలు విధించింది. అయితే, ప్రస్తుత కొనుగోళ్లలో తేమ శాతం మాత్రమే చూస్తూ తాలు, ఇతరత్రా వ్యర్థాలను తొలగించకుండానే కొనుగోలు కేంద్రాల్లో తూకం వేస్తున్నారు. ఈ పరిస్థితి రైతులకు అనుకూలంగా ఉందని అందరు భావిస్తున్నారు. కానీ, అక్కడే రైతులు దోపిడీకి గురవుతున్నారు. నిజానికి యంత్రాల ద్వారా వరి కోసినప్పుడే తాలు, ఇతర వ్యర్థాలు ఎక్కువగా రాకుండా ఉంటాయి. ఆరబెట్టిన తర్వాత తేమ శాతం వచ్చిందంటే తూకం వేసుకునే స్థితిలోనే ఉంటున్నాయి. ఈ విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న కొందరు మిల్లర్లు ధాన్యం శుభ్రం చేయకున్నా తేమ శాతం చూసుకుని తూకం వేస్తే సరిపోతుందని చెబుతున్నారు. అధికారులు కూడా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. నిజానికి ధాన్యం తూకం వేసినపుడు ఒక్క సంచి బరువు మాత్రమే తీసి వేయాలి. కానీ, కొనుగోలు కేంద్రాల్లో అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. తరుగు పేరిట దోపిడీ చేస్తుండగా రైతులు నిండా మునగాల్సి వస్తున్నది.

### క్వింటాల్‌కు 5.50 కిలోలు అదనపు తూకం

ధాన్యం కొనుగోళ్ల సమయంలో ప్రతి బస్తా(40 కిలోల)కు 2.200 కిలోల చొప్పున క్వింటాల్‌కు 5.50 కిలోల వరకు అదనంగా తూకం వేస్తున్నారు. అందులో గన్నీ బ్యాగు బరువు 200 గ్రాములు కాగా, క్వింటాలుకు 500 గ్రాములు ఉంటుంది. కానీ, క్వింటాలుకు 5 కిలోలు తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సింగిల్ విండోలు, ఐకేపీ, డీసీఎంఎస్, హాకా.. నిర్వాహకులు ఎవరైనా, కేంద్రం ఏదైనా తరుగు పేరిట దోపిడీ జరుగుతూనే ఉన్నది. ఒక్క కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే తరుగు పేరుతో 4.4 మెట్రిక్ టన్నులకుపైగా దోపిడీకి గురైనట్లు తెలుస్తున్నది. ఇలా జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ ఇలాగే దోపిడీ చేస్తున్నట్టు రైతులు వాపోతున్నారు. ప్రతి బస్తా సంచి బరువుతో కలిపి 42.200 కిలోలకు పైగా ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చే తక్ పట్టీలో మాత్రం 40 కిలోలే అని ధ్రువీకరిస్తున్నారు. ఒక రైతు వంద క్వింటాళ్ల ధాన్యం తెస్తే 40 కిలోల బ్యాగులు 250 అవుతాయి. ఒక్కో బ్యాగుకు సంచి బరువు పోగా, 2 కిలోల చొప్పున తరుగు తీస్తే 5 క్వింటాళ్ల వరకు అవుతుంది. ఈ సీజన్‌లో కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి ₹2,320 చెల్లిస్తున్నది. అంటే 5 క్వింటాళ్లకు ₹11,160 నష్టపోవాల్సి వస్తున్నది. అంటే ఒక్కో రైతు కష్టం మిల్లర్లకు ఏమేర చేరుతున్నదో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

### కేంద్రం ఏదైనా తరుగు దోపిడే

ప్రస్తుత సీజన్‌లో పీఏసీఎస్‌లు, ఐకేపీ, డీసీఎమ్మెస్, హాకా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు ఎవరైనా, కేంద్రం ఏదైనా ఒకే రీతిలో రైతులను దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాలు, ఇతర వ్యర్థాలు లేకున్నా, ఎఫ్ఏక్యూ నిబంధనలకు అనుకూలంగా ఉన్నా ఈ దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తున్నది. రైతులు అడిగితే ధాన్యం శుభ్రం చేసి ఇవ్వాలని కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. ఈ శ్రమ ఎందుకని రైతులు నిస్సహాయతను వ్యక్తం చేస్తూ తూకం వేసేందుకు అంగీకరిస్తున్న తీరు కనిపిస్తున్నది. ఒక్క కరీంనగర్ జిల్లాలో దోపిడీకి గురైన ధాన్యం విలువ కనీస మద్దతు ధరతో లెక్కించినా కొన్ని కోట్లలోనే ఉండే అవకాశమున్నది.


ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి ఎత్తుతున్న హమాలీలు

### కేంద్రాల్లో రైతుల నిరీక్షణ

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నది. హమాలీల కొరత కూడా కనిపిస్తున్నది. ఒక్కో కేంద్రానికి రోజుకు పది నుంచి పది హేను మంది రైతులు తమ ధాన్యం తీసుకుని వస్తుండగా నలుగురైదుగురు రైతులకంటే ఎక్కువ మందికి సంబంధించిన ధాన్యం తూకం వేయలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు టోకెన్లు ఇస్తున్నారు. పరిస్థితిని పసిగడుతున్న కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి మామూళ్లు కూడా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముందుగా వచ్చిన రైతులు ప్రశ్నిస్తే ధాన్యం బాగా లేదనో, ఇంకా తేమ ఉందనో సాకులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇక హమాలీ ఖర్చులు కూడా రైతులే భరించాల్సి వస్తున్నది. క్వింటాలుకు ₹50 చొప్పున హమాలీ తీసుకుంటున్నారు. వీటిని గతంలో ప్రభుత్వమే భరించేది. రైతులు ముందుగా చెల్లించినా తర్వాత వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

### అధికారులు ఏం చేస్తున్నట్టు?

ధాన్యం కొనుగోళ్లలో పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రైతుల నుంచి అదనంగా తూకం వేస్తున్న విషయం అధికారులు, మిల్లర్ల మధ్య ఒప్పందం కుదిరిన తర్వాతనే ఇలా జరుగుతోందనే ఆరోపణలు సైతం లేక పోలేదు. గతంలో రైతులు తూకానికి ముందు ధాన్యాన్ని శుభ్రం చేసేందుకు కొనుగోలు కేంద్రాలకు ఫ్యాన్లు పంపిణీ చేశారు. మిల్లర్లతో కుమ్మక్కైన కారణంగా ఇప్పుడు వాటిని పక్కన పడేశారు. రైతులకు శ్రమ తప్పుతుందనే సానుభూతి వచనాలు పలుకుతుండగా ఇది తమ పరిధిలోని విషయం కాదని కొనుగోళ్లకు ప్రధాన ఏజెన్సీగా వ్యవహరిస్తున్న ఓ శాఖ అధికారులు చెబుతున్నారు. నిజానికి అధికారులు తలుచుకుని ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు జరిపితే రైతుల శ్రమ దోపిడీకి గురయ్యేది కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు సుమారు 80 వేల మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు జరిగాయి. అందులో 4.4 మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా వెళ్లినట్లు తెలుస్తోంది. లక్ష్యం మేరకు కొనుగోళ్లు జరిగితే ఎంత దోపిడీ జరుగుతుందో దీన్ని బట్టి అర్థమవుతుంది. ఇప్పటికైనా అధికారులు ఈ పద్ధతిని అరికట్టి రైతులకు న్యాయం చేయాలనే డిమాండ్ వినిపిస్తున్నది.



#### ఏం చేయలేని పరిస్థితి మాది



నేను 103 బస్తాల వడ్లు అమ్మిన. 42 కిలోలు పెట్టి 40 కిలోలు రాసిస్తున్నరు. ఏమన్నా అంటే వడ్లు పట్టిచ్చి ఇయ్యుండ్రి అంటున్నరు. ఎండల ఎందుకు ఆ కష్టమని రైతులు సప్పుడు చేస్తలేరు. ఒక్కో రైతు బాగనే లాస్ అవుతున్నడు. జరిగేది అందరికీ తెలుసు. అడిగెటోళ్లు ఎవరున్నరు.

**- మారం అంజయ్య, రామకృష్ణకాలనీ**

#### వడ్లు తెచ్చి నాలుగు రోజులైతంది

కేంద్రానికి వడ్లు తెచ్చి నాలుగు రోజులైతంది. రేపు మాపు అంటున్నరు. నాకు నాలుగు ట్రాక్టర్లు ఎల్లినయి. 150 బస్తాలు అయితండచ్చు. తరుగు తీత్తుండ్రట. నాకో 300 కిలోలు పోతయి. ఏం చేసుడు. తరుగు తియ్యద్దని అంటే కొనెటట్టు లేరు. మరి యాడికివోయి అమ్ముకునుడు? ఏం చేసేది లేక ఎంతకో అంతకు అమ్ముకుంటున్నం. వడ్లు గల్లర గల్లర అయినంకనే కొంటున్నరు. గింత పెల్లసుత లేదు. ఉంటె ఇంత తాలు, చెత్త ఉంటది. అది సుతం సంచికి కిల ఎల్లది. అయినా గిట్ల జేత్తండ్రు? తెలిసి సుతం ఇక్కడన్నే అమ్ముకునడైతందంటే మా పరిస్థితి ఎట్లున్నదో చూడుండ్రి.

**- బొల్ల బాలయ్య, రామకృష్ణకాలనీ**


మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించిన అనంతరం నినదిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

## కార్మికుల సంక్షేమానికి కృషి

మేడే వేడుకల్లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, మే 1 : కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు పోరాటం చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కార్మికుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. కరీంనగర్‌లో బీఆర్‌టీయూ, బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో గురువారం పలుచోట్ల జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్మికులందరికీ ప్రపంచ కార్మిక దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మీ అందరి ఆశీర్వాదంతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ , మాజీ కార్పొరేటర్లు మేచినేని అశోక్‌రావు, కుర్ర తిరుపతి, బీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దావ రాజమల్లు, పట్టణ అధ్యక్షుడు సంపత్, మున్సిపల్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు పొన్నం లింగయ్య, ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు రాజేందర్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు బొంకురి రాములు, నాయకులు సంపత్ మల్లేశం కార్మిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యో బిడ్డా.. నువ్వే స్కూల్ ఫస్ట్ అచ్చినవట!

- చెప్పినట్టే మంచి మార్కులు తెచ్చుకున్నవ్
- ఇప్పుడు మా మధ్య లేకపోతివి
- కన్నీరుమున్నీరైన నాగచైతన్య తల్లిదండ్రులు
- పదిహేను రోజుల కిందటే అనారోగ్యంతో బాలిక మృతి


నాగచైతన్య (ఫైల్)

బోయినపల్లి రూరల్, మే 1 : 'బిడ్డా పదో తరగతి ఫలితాలు వచ్చినయ్. నువ్వు చెప్పినట్టే మంచి మార్కులు తెచ్చుకున్నవ్. నువ్వే స్కూల్ ఫస్ట్ అచ్చినవట. మీ సార్లు చెప్పిండ్రు. ఇప్పుడు నువ్వే లేకపోతివి కదా తల్లీ' అంటూ పదో తగరతి విద్యార్థి నాగచైతన్య తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పదో తరగతి పరీక్షలు రాసి పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయిన ఆ బాలికకు బుధవారం వెల్లడైన ఫలితాల్లో మంచిమార్కులు రాగా, బిడ్డను తలుచుకుంటూ కంటతడి పెట్టారు. బోయినపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల రవి, రజిత దంపతులకు ముగ్గురు కూతుళ్లు. చిన్న కూతురు నాగచైతన్య (15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివేది. అయితే ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందింది. అయినా ఎప్పుడూ చలాకీగా కనిపించేది. మార్చిలో టెన్త్ పరీక్షల కోసం బాగా ప్రిపేర్ అయింది. పరీక్షలు కూడా రాసింది. పరీక్షలు బాగా రాశానని, తనకు మంచి మార్కులు వస్తాయని తల్లిదండ్రులతో సంతోషంగా చెప్పింది. కానీ, అంతలోనే ఘోరం జరిగిపోయింది. ఆ బాలిక కొద్ది రోజులకే దవాఖానలో అడ్మిట్ అయింది. గత నెల 17న పరిస్థితి విషమించి చనిపోయింది. కుటుంబాన్ని కొండంత దుఃఖంలో ముంచి వెళ్లిపోయింది. కాగా, బుధవారం పదోతరగతి ఫలితాలు విడుదల కావడం, 510 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్‌ర్యాంకు పొందింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ కూతురును తలుచుకొని విషాదంలో మునిగిపోయారు. బిడ్డ చదివే పాఠశాలకు వెళ్లి, కన్నీరుమున్నీరయ్యారు. తమ కూతురు చెప్పినట్టే మంచి మార్కులు సాధించిందని, కానీ, ఇప్పుడు తమ కూతురు లేదని విలపించారు. ఇటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు నాగచైతన్యను తలుచుకొని కంట తడి పెట్టారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్


2ఇంక్లైన్ గని వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, మే 1 : కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలని, సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గురువారం మేడే సందర్భంగా స్థానిక 2ఇంక్లైన్‌లో మేడే పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. చారిత్రాత్మక మేడే స్ఫూర్తితో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కార్మిక హక్కుల కోసం అండగా నిలిచిందన్నారు. కార్మికులకు బోనస్, ఉద్యోగ భద్రత, జీత భత్యాలు పెంపు, ఆరోగ్యబీమా వంటి సంక్షేమ పథకాలతో భరోసా కల్పించి గౌరవించామని గుర్తు చేశారు. సింగరేణి సంస్థ ప్రైవేటీకరణకు కుట్రలు చేస్తున్నారని, కార్మిక లోకం ఒక్కటిగా మేడే స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రం వైఖరిపై ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు వడ్డెపల్లి శంకర్, నారాయదాణ మారుతి, రామరాజు, కోడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టిన కూతురు

- దిక్కుతోచని స్థితిలో అటవీప్రాంతంలోకి నడుచుకుంటూ వెళ్లిన వృద్ధురాలు
- గమనించి సఖీ సెంటర్‌కు తరలించిన స్థానికులు

జగిత్యాల, మే 1 : కన్న కూతురే తల్లిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఆ వృద్ధురాలు అడవిలోకి నడుచుకుంటూ వెళ్లగా, స్థానికులు గమనించి సఖీ సెంటర్‌కు తరలించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివారాలిలా ఉన్నాయి. జగిత్యాలలోని ఇస్లాంపురలో నివాసం ఉండే వేల్పుల బూదవ్వ భర్త చనిపోవడంతో ఒక్కగానొక్క కూతురైన ఈశ్వరి అత్తగారి ఊరైన నర్సింగాపూర్‌లో ఉంటున్నది. ఈశ్వరికి భర్త రాజయ్య, కొడుకు చిరంజీవి ఉన్నారు. కాగా, జగిత్యాల శివారులో బూదవ్వ పేరిట ఉన్న ఒక ఎకరం భూమి, ఇంటిని ఆమె కూతురు ఈశ్వరి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నది. తర్వాత బూదవ్వను వేధించడం, సూటిపోటి మాటలు అనడంతో పాటు బిడ్డతో పాటు మనుమడు కొట్టి ఇంట్లోంచి వెళ్లగొట్టారు. దీంతో బూదవ్వ చేతి కర్ర పట్టుకుని పది కిలోమీటర్లు నడిచి గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె అటవీ ప్రాంతం వరకు వెళ్లింది. అక్కడ ఆమె అలికిడి శబ్దాలు విన్న స్థానికులు అధికారులకు సమాచారం అందించగా, అసలు విషయం బయటపడింది. వెంటనే సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ తన సిబ్బందితో వెళ్లి బూదవ్వను సఖీ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈశ్వరి చేసుకున్న భూమి, ఇంటి రిజిస్ట్రేషన్ వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

## ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించండి

వీరాపూర్‌లో రైతుల ఆందోళన


రాయికల్ మండం వీరాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

రాయికల్, మే 1 : వరి కోతలు ప్రారంభమై నెల రోజులైనా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదంటూ రాయికల్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉప్పుమడుగు –ఆలూర్ ఎక్స్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని ధోబీఘాట్ వద్ద కుప్పలు పోసి చాలా రోజులవుతున్నా అధికారులు ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదని మండిపడ్డారు. అకాల వర్షాలు పడి ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్, తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యాం ధర్నా చేస్తున్న స్థలానికి చేరుకొని వారితో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపి ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పుమడుగు ప్యాక్స్ చైర్మన్ దీటి రాజరెడ్డి, వైస్ చైర్మన్ దుంపల స్వామిరెడ్డి, రైతులు దిండిగాల రామస్వామి, మాద రాజేశం, ముక్కెర నరేశ్, మల్లీక్ అహ్మద్, వెంకటేశ్, మహిపాల్, గంగాధర్, ఇస్మాయిల్, పల్లి మల్లయ్య, రాయమల్లు, భూమయ్య ముత్యాలు, అంజయ్య, నర్సయ్య, రాజు పాల్గొన్నారు.

